సాక్షి
జనగామ
శనివారం | 2 | సెప్టెంబర్ | 2023



వందశాతం ఫలితాలు సాధించాలి

గిరిజన విద్యాసంస్థల్లో పదో తరగతి విద్యార్థులు వందశాతం ఫలితాలు సాధించాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. - 8లో



ఆర్టీసీ వరంగల్ రీజియన్ ఘనత

ఆక్యుపెన్సీ రేషియోలో వరంగల్ రీజియన్ రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచింది. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం $32^0/24^0$

జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు కాస్త తగ్గుతాయి.

న్యూస్‌రీల్

డయాలసిస్ సెంటర్ సిద్ధం



జఫర్‌గఢ్: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ సెంటర్ ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందని జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ సుగుణాకర్‌రాజు తెలిపారు. శుక్రవారం సీహెచ్‌సీని సందర్శించి డయాలసిస్ సెంటర్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట డాక్టర్ శోభ, రాజు, చంద్రమౌళి తదితరులు ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



తరిగొప్పుల: పోలీసు సిబ్బంది విధుల విషయంలో అప్రమత్తంగా ఉంటూ ప్రజలతో ఫ్రెండ్లీగా వ్యవహరించాలని ఏసీపీ కొత్త దేవేందర్ రెడ్డి అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి రికార్డులు, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం సిబ్బంది డ్రిల్ నిర్వహించారు. సీఐ పాటి నాగబాబు, ఎస్సై నరేష్ పాల్గొన్నారు.

క్రైస్తవ సంఘాల జిల్లా అధ్యక్షుడిగా జాన్



జనగామ రూరల్: క్రైస్తవ సంఘాల జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన నల్లా జాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం జిల్లా కేంద్రం హైదరాబాద్‌రోడ్డున ఉన్న యునిక్ చర్చిలో జిల్లా పరిధి అన్ని మండలాల క్రైస్తవులతో కె.మోజెస్, జి.నర్సింగరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పి.పిలిప్, కార్యదర్శిగా ఎన్.ప్రావిన్స్, సహాయ కార్యదర్శిగా జోసెఫ్, కోశాధికారిగా కె.సంజీవ, సలహాదారులుగా కె.ఎమ్.జాన్, దేవసహాయం, జాయ్ డేవిడ్ తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జాన్ మాట్లాడుతూ.. క్రైస్తవుల అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు.

టికెట్ ఇస్తే పార్టీ ప్రతిష్ట నిలబెడతా.. : సిద్ధయ్య



జనగామ: జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే బరిలో నిలిచేందుకు అవకాశం కల్పిస్తే గెలిచి సీఎం కేసీఆర్‌తోపాటు పార్టీ ప్రతిష్ట నిలబెడతానని సీనియర్ నాయకుడు, న్యాయవాది జల్లి సిద్ధయ్య అన్నారు. మూడోసారి సీఎంగా కేసీఆర్ గెలవాలని, టికెట్టు అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలంటూ ఏర్పాటు చేసిన వాల్ పోస్టర్‌ను శుక్రవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పాలకుర్తి టికెట్ కేటాయించిన అనంతరం స్థానికులకు అప్పగించారని, ఈ క్రమంలో మరోసారి జనగామ టికెట్ అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. మారిన రాజకీయ సమీకరణలతో తనకు అవకాశం రాకున్నా పార్టీ కోసం నిరంతరం పాటుపడ్డానని, అత్యధిక బీసీ జనాభా కలిగిన ప్రాంతంలో స్థానికుడైన తనకు టికెట్ కేటాయిస్తే అధిక మెజార్టీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు పోగుల సారంగపాణి, ఆరేళ్ల హరిరాములు, అశోక్‌కుమార్, ఆరేళ్ల విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి పాటుపడాలి



జనగామ: పట్టణంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి యువత పాటుపడాలని బీజేపీ నాయకుడు బెజాడీ బీరప్ప అన్నారు. శుక్రవారం పట్టణంలో ఆత్మగౌరవ జెండా కోసం.. ఆత్మీయ మిత్రులతో సమావేశం నిర్వహించారు. 19, 20, 21, 22 వార్డుల్లో నెలకొన్న సమస్యలపై ఆరాతీసి పరిష్కారానికి చేపట్టాల్సిన కార్యాచరణపై మాట్లాడారు.


నేటి సమావేశాన్ని విజయవంతం చేయాలి

జనగామ: పాలకుర్తి మండల కేంద్రంలో శనివారం తలపెట్టిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కోరారు. సమావేశానికి వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు రవీంద్ర ఉత్తమ్‌రావు దాల్వి రానున్నందున నాయకులంతా హాజరు కావాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బదిలీలు, పదోన్నతులకు మోక్షం!

అర్హులైన ఉపాధ్యాయుల జాబితా సిద్ధం

- హైకోర్టు స్టే ఎత్తివేతతో టీచర్లలో ఆనందం
- రేపటి నుంచి కొనసాగనున్న ప్రక్రియ
- జిల్లాలో 215 మంది ప్రమోషన్లు పొందే అవకాశం



జనగామ రూరల్: సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలకు మోక్షం లభించనుంది. హైకోర్టు స్టే ఎత్తివేయడంతో అర్హులైన టీచర్లకు ట్రాన్స్‌ఫర్లు, ప్రమోషన్లు చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ దేవసేన, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తేదీలను ప్రకటించగా.. గతంలో ఆగిన ప్రక్రియ తిరిగి ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 215 మందికి అవకాశం దక్కనుంది. వాస్తవంగా వివిధ కేటగిరీల్లో మొత్తం 426 పోస్టులు ఖాళీ ఉండగా.. పదోన్నతుల కింద 215 పోస్టులు పోను.. మిగతావి డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నారు. గెజిటెడ్ హెచ్‌ఎం-2, పీజీ హెచ్‌ఎం పోస్టులు పూర్తిగా పదోన్నతులతో నింపనున్నారు. ఇప్పటికే ప్రమోషన్లకు సంబంధించి సీనియార్టీ జాబితాను జిల్లా అధికారులు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. నోటిఫికేషన్ జారీ అయిన వెంటనే ప్రక్రియ చేపట్టనున్నారు.

ఖాళీల వివరాలు..

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో గెజిటెడ్ హెచ్‌ఎంలు, గ్రేడ్-2 డిప్యూటీ ఐఓఎస్, ఎస్‌ఏ మ్యాథ్స్, ఫిజిక్స్, బయోసైన్స్ సోషల్, ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూ, హిందీ తదితర పోస్టులు 426 ఖాళీగా ఉన్నాయి. వీటిలో 215 పోస్టులు పదోన్నతుల కింద భర్తీ కానున్నాయి. వాటిలో గ్రేడ్-2 హెడ్‌మాస్టర్ 49, ఎస్‌ఏ మ్యాథ్స్ 12, ఫిజికల్ సైన్స్ 5, బయోసైన్స్ 28, బయోసైన్స్ ఉర్దూ మీడియంల 1, ఎస్‌ఏ సోషల్ 35, ఎస్‌ఏ సోషల్ ఉర్దూ 1, ఎస్‌ఏ తెలుగు 9, ఎస్‌ఏ హిందీ 4, ఎస్‌ఏ ఇంగ్లిష్ 11, ఎస్‌ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్ 3, పీజీ హెచ్‌ఎం 57 ఉన్నాయి.

ఇన్‌చార్జీలే అధికం..

జిల్లా విద్యాశాఖలో పర్యవేక్షక అధికారుల పోస్టులను సైతం ఏళ్ల తరబడి భర్తీ చేయకపోవడంతో ఖాళీల సంఖ్య పెరుగుతోంది. సీనియర్ హెచ్‌ఎంలకు అదనపు బాధ్యతలు అప్పగించి పనులు కొనసాగిస్తున్నారు. మొత్తం 12 మండలాల్లో ఎంఈఓ పోస్టులన్నీ ఖాళీగానే ఉన్నాయి. సీనియర్ గెజిటెడ్ హెచ్‌ఎంలు ఆయా బాధ్యతలు చూస్తున్నారు. గెజిటెడ్ హెడ్‌మాస్టర్లు 99 మంది ఉండగా.. 50 మంది విధులు నిర్వహిస్తున్నారు. మిగతా 49 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలుస్తోంది.

వెంటాడుతున్న ఉపాధ్యాయుల కొరత

జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలు 508 ఉండగా.. సుమారు 2,185 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. పలు పాఠశాలల్లో నాలుగైదు ఏళ్లనుంచి స్కూల్ అసిస్టెంట్‌లు, ఎస్జీటీలు, వ్యాయామ ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ చేశారు. వారి స్థానంలో ఎవరినీ భర్తీ చేయకపోవడంతో విద్యార్థుల చదువు, భవిష్యత్ ప్రశ్నార్థకంగా తయారైంది. ప్రస్తుతం పని చేస్తున్న వారిపై బోధన భారం అధికంగా పడుతోంది. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీలోనూ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల భర్తీ కనిపించడం లేదు.

ప్రక్రియ జరిగేదిలా..

- ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించి సెకండరీ గ్రేడ్ టీచర్లు.. స్కూల్ అసిస్టెంట్లుగా, ఎస్‌ఏలు ఆయా స్కూళ్లలో హెచ్‌ఎంలుగా పదోన్నతి పొందనున్నారు.
- ప్రస్తుతం పని చేస్తున్న చోట ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నవారికి బదిలీ వర్తిస్తుంది. పోస్టులు కేటాయించే క్రమంలో తప్పనిసరిగా నిబంధనల ప్రకారం సీనియార్టీకి ప్రాధాన్యత ఇస్తారు.
- ఐదేళ్లు ఒకే దగ్గర విధులు నిర్వర్తించిన ప్రధానోపాధ్యాయులకు బదిలీ అవకాశం ఉంది.

మార్పులు.. చేర్పులు

- 2015లో బదిలీ అయిన టీచర్లు, 2018లో బదిలీ అయిన హెడ్‌మాస్టర్‌లు ప్రస్తుతం బదిలీ కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.
- ఇందుకు 2023 ఫిబ్రవరి ఒకటో తేదీ కటాఫ్ ఉండగా.. ప్రస్తుతం దానిని 2023 సెప్టెంబర్ ఒకటికి మార్చనున్నారు.
- రిటైర్మెంట్‌కు మూడేళ్ల లోపు సర్వీస్ ఉన్న టీచర్లు, హెచ్‌ఎంలకు తప్పనిసరిగా బదిలీలో మినహాయింపు ఉంటుంది.
- ఇదివరకు టీచర్ యూనియన్ నాయకులకు పది పాయింట్లు ఉండగా దానిని తొలగించనున్నారు. స్పౌజ్ టీచర్లకు పది పాయింట్లు అమలు చేయనున్నారు.
- కొత్త దరఖాస్తులకు, ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకు ఎడిట్ చేసుకునేందుకు అవకాశం కల్పించనున్నారు.

ఉత్తర్వులు స్పష్టంగా ఉండాలి



ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించి ప్రక్రియలో ఎలాంటి సందేహాలు లేకుండా ఉత్తర్వులు స్పష్టంగా ఉండాలి. ఇప్పటికే ప్రభుత్వం చాలా ఆలస్యం చేసింది. బోధన విషయంలో అనేక సమస్యలు వస్తున్నాయి. విద్యాప్రమాణాలు దెబ్బతింటున్నాయి. మిగిలిన ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి.

- డి.శ్రీనివాస్, టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి



బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి. పండిట్, పీఈటీ పోస్టులను ఉన్నతీకరించాలి. ముందుగా ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి సూచనలు సలహాలు తీసుకున్న తరువాత భర్తీ ప్రక్రియ చేపట్టాలి. హైకోర్టు స్టే ఎత్తివేయడంతో మళ్లీ కోర్టు కేసులు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలి.

- పి.చంద్రశేఖర్, టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

నిబంధనల మేరకే ప్రక్రియ



ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీల ప్రక్రియను ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు చేపట్టనున్నాం. ఈ మేరకు కసరత్తు చేసి జిల్లా వ్యాప్తంగా అర్హుల జాబితా సిద్ధం చేశాం. ప్రమోషన్ నోటిఫికేషన్ అందగానే ప్రక్రియ ప్రారంభం అవుతుంది. పారదర్శకంగా బదిలీలు, ప్రమోషన్లు ఉంటాయి.

- కె.రాము, జిల్లా విద్యాధికారి

నేడు, రేపు ఓటరు నమోదు

- నియోజకవర్గ కేంద్రాల్లో ప్రత్యేక క్యాంపెయిన్ : కలెక్టర్

జనగామ: జిల్లాలో ఈనెల 2, 3 తేదీల్లో ఓటర్ల నమోదుపై ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గాల పరిధి పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. 2023 అక్టోబర్ ఒకటి నాటికి 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. ఓటరు నమోదుకు ఫారం-6లో పూర్తి వివరాలు పేర్కొని దరఖాస్తు చేసుకోవాలని, అలాగే ఓటర్.ఈసీఐ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ లేదా ఓటర్ హెల్ప్‌లైన్ మొబైల్ యాప్ ద్వారా కూడా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని సూచించారు. అభ్యంతరాలుంటే ఫారం 7, నివాసం మార్పు, సవరణలకు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి విస్తృతంగా ప్రచారం చేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

ఓటుహక్కుపై అవగాహన కలిగి ఉండాలి

స్టేషన్‌ఘన్‌పూర్: యువత ఓటుహక్కు ప్రాధాన్యతపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా నోడల్ అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్ అన్నారు. స్థానిక తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలోని విద్యాజ్యోతి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఓటుహక్కు ప్రాధాన్యత, ఓటింగ్ విధానంపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య దేశంలో ఓటు ఎంతో విలువైనదని, వజ్రాయుధం లాంటి ఓటు హక్కును సద్వియోగం చేసుకోవాలని సూచించారు. డీటీలు విజయ్‌కుమార్, రాజేష్, ఆర్‌ఐలు రవీందర్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నోడల్ అధికారి వినోద్‌కుమార్

సమాజ నిర్మాణంలో పాలుపంచుకోవాలి

జనగామ రూరల్: యువత సమాజ నిర్మాణంలో పాలుపంచుకోవాలని ఆర్డీఓ మురళీకృష్ణ అన్నారు. ఓటు హక్కుపై జనగామ ఏబీవీ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా తమ ఓటును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నర్సయ్య, రవిప్రసాద్, శ్రీనివాస్, రాజేష్‌కుమార్, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

మహంకాళమ్మ ఆలయానికి బోనాలతో వెళ్తున్న మహిళలు



మహంకాళమ్మకు బండ్లు, బోనాలు

లింగాలఘణపురం: మండల కేంద్రంలో శుక్రవారం మహంకాళమ్మకు బండ్లు, బోనాలు వైభవంగా నిర్వహించారు. ఆయా సామాజిక వర్గాలకు చెందిన వారంతా గ్రామ సంప్రదాయం ప్రకారం ఎడ్ల బండ్లను కట్టి ఆలయం చుట్టూ తిప్పారు. అనంతరం బోనాలు చేసి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయ్‌మనోహర్, ఎంపీటీసీ బిక్షపతి, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గంగాదేవికి తెప్ప బోనం

అలాగే పాత చెరువు గంగాదేవి ఆలయంలో గంగ తెప్ప బోనం సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి చెరువులు, కుంటలు నిండడంతో గంగపుత్రులంతా సంతోషంగా మొక్కులు చెల్లించారు. గంగపుత్ర సంఘం అధ్యక్షుడు కొండయ్య, సొసైటీ అధ్యక్షుడు సత్యనారాయణ, శ్రవన్‌కుమార్, శ్రీశైలం, యాదగిరి, అంజయ్య, రాజు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు రావాలి

జనగామ రూరల్: కేజీబీవీల్లో మిగిలిపోయిన పోస్టుల భర్తీకి ఫోన్‌కాల్ వచ్చిన అభ్యర్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు రావాలని డీఈఓ రాము ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధి కేజీబీవీల ఖాళీ పోస్టుల్లో తాత్కాలిక పద్ధతిన భర్తీ చేయడానికి నిర్వహించిన రాత పరీక్షలో పాల్గొన్న వారికి గత నెలలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేపట్టారు. కేజీబీవీ, యూఆర్‌ఎస్ పాఠశాలల్లో సీఆర్టీ, పీజీ సీఆర్టీ, ఎస్‌ఓ పోస్టులకు అభ్యర్థులు హాజరు కాగా రోస్టర్ పాయింట్ల మేరకు 1:3 ప్రకారం 126 మందిని పిలిచారు. అందులో భర్తీకాని పోస్టులకు శనివారం కలెక్టరేట్‌లోని డీఈఓ కార్యాలయం వద్దకు ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని డీఈఓ పేర్కొన్నారు.

బీజేపీ కనుసన్నల్లోనే బీఆర్‌ఎస్

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

జనగామ రూరల్: అధికారం కోసం బీజేపీ చేసిన కుటిల యత్నాన్ని బీఆర్‌ఎస్ పార్టీ తట్టుకోలేక తలొగ్గి ఆ పార్టీ కనుసన్నల్లో పనిచేస్తున్నదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆకుల శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంపన్న వర్గాల కోసం పనిచేయడమే లక్ష్యంగా తమ ఎజెండాను మార్చుకుని ప్రజలపై కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నాయని విమర్శించారు. బీజేపీకి వ్యతిరేకంగా పని చేస్తామని చెప్పిన కేసీఆర్.. తన కుటుంబాన్ని కాపాడుకోవడానికి, ఈడీ దాడుల నుంచి రక్షణ పొందడానికి ఆ పార్టీతో కలిసిపోయాడని అన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌కు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. ఎన్నికల్లో సీపీఐ, సీపీఎం కలిసి పోటీ చేస్తాయని చెప్పారు. బీజేపీతో బీఆర్‌ఎస్ జతకట్టడం వల్ల మరింత ప్రమాదం పొంచిఉందని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాజారెడ్డి, సుగుణమ్మ, జనార్దన్, సోమయ్య, రమేష్, తోట రమేష్, సదానందం, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

వల్మిడిలో ప్రారంభమైన ప్రతిష్ఠాపనోత్సవాలు

- పల్లకీలో గుట్టపైకి ఉత్సవ మూర్తి..
- శాస్త్రోక్తంగా అంకురార్పణ కార్యక్రమాలు

పాలకుర్తి/పాలకుర్తి టౌన్: వల్మిడిలో శ్రీసీతారామచంద్రస్వామి విగ్రహాల పునఃప్రతిష్ఠాపన, నూతన దేవాలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలు శుక్రవారం సాయంత్రం మొదలయ్యాయి. శాస్త్రోక్తంగా కార్యక్రమాలు నిర్వహించారు. అంతకు ముందు వాల్మీకిపురం వల్మిడి గ్రామంలో శ్రీసీతారామచంద్రస్వామి వారి పురాతన దేవాలయం నుంచి స్వామి వారి విగ్రహాన్ని మంగళ వాయిద్యాల మధ్య ఊరేగింపుగా రాములవారి గుట్టమీద నూతన దేవాలయ ప్రాంగణంలోకి తీసుకువచ్చి అంకురార్పణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి ట్రస్టు చైర్‌పర్సన్ ఉషాదయాకర్‌రావు, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ మాట్లాడుతూ దైవిక కార్యక్రమంలో పాలుపంచుకోవడం అదృష్టమని పేర్కొన్నారు. భక్తులంతా నాలుగు రోజులు జరిగే ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు. డీఆర్‌డీఓ రాంరెడ్డి, పాలకుర్తి, వల్మిడి ఆలయాల చైర్మన్‌లు వెనుకదాసుల రామచంద్రయ్యశర్మ, వీరమళ్ల జైహింద్, ఈఓ లక్ష్మీప్రసన్న, సర్పంచ్ సైదులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. నూతన దేవాలయం ప్రారంభోత్సవంలో భాగంగా శుక్రవారం రాత్రి గణపతి పూజా కార్యక్రమాలతో శ్రీవిద్య శ్రీశివసాయి నాట్యాలయం, తెలంగాణ సాంస్కృతిక సారధి బృందం ప్రదర్శించిన కళా రూపాలు అలరించాయి.



పూజలో పాల్గొన్న ఉషాదయాకర్‌రావు, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ తదితరులు



ఉత్సవ మూర్తిని పల్లకీలో గుట్టపైకి తీసుకెళ్తూ..

వల్మిడికి ప్రత్యేక బస్సు సర్వీసులు

జనగామ రూరల్/పాలకుర్తి: పాలకుర్తిలోని వల్మిడి శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో నూతన ఆలయం ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి జనగామ, పాలకుర్తి, అలాగే స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి 2, 3, 4 తేదీల్లో ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు డిపో మేనేజర్ జోత్స్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

చేనేత కార్మికుల సంబరాలు

జనగామ: రాష్ట్ర ప్రభుత్వం చేనేత మిత్ర పథకాన్ని సులభతరం చేస్తూ కార్మికుల ఖాతాల్లోకి నేరుగా డబ్బులు వేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా కేంద్రంలోని వీవర్స్ కాలనీలో చేనేత కార్మికులు శుక్రవారం సంబరాలు చేసుకున్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, ఎమ్మెల్సీ ఎల్.రమణ ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా 12వ వార్డు కౌన్సిలర్ గుర్రం భూలక్ష్మి, భారతి సొసైటీ అధ్యక్షుడు గుర్రం నాగరాజు, ఎనగందుల కృష్ణ, చిదురాల గణేష్, జయరాములు, పెండెం సత్తయ్య, వెంకటేశ్వర్లు, బాలస్వామి, బిట్ల శంకర్, చింతకింది ఆగయ్య, ఆంజనేయులు, ఆనంద సత్తయ్య, పిట్టల సత్తయ్య, సురేష్, భాస్కర్, శ్రీనివాస్, హరినాథ్ పాల్గొన్నారు.



సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న చేనేత కార్మికులు

పెంపుడు శునకానికి అంత్యక్రియలు

పాలకుర్తి/పాలకుర్తి టౌన్: పెంపుడు శునకానికి అంత్యక్రియలు నిర్వహించిన సంఘటన పాలకుర్తి మండలం ఈరవెన్ను గ్రామంలో జరిగింది. పసునూరి నాగేశ్వర్ 13 సంవత్సరాలుగా పెంచుకుంటున్న శునకం(జిమ్మి) శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. యజమాని అంత్యక్రియలు నిర్వహించగా గ్రామస్తులు పాల్గొన్నారు.



శునకం అంత్యక్రియల్లో పాల్గొన్న ప్రజలు

చేర్యాలలో కోర్టు త్వరగా ఏర్పాటు చేయాలి



న్యాయ శాఖ రాష్ట్ర కార్యదర్శికి బొకే ఇస్తున్న జనగామ న్యాయవాదులు

జనగామ: సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలో కోర్టు త్వరగా ఏర్పాటు చేయాలని జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కూరెళ్ల శ్రీనివాస్‌రెడ్డి.. తెలంగాణ రాష్ట్ర న్యాయ శాఖ కార్యదర్శి రేండ్ల తిరుపతిని కోరారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో ఆయనకు కలిసి బొకే అందజేసి సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ చేర్యాలలో సివిల్ కోర్టు, జనగామలో ఎస్సీ, ఎస్టీ కోర్టు, అదనపు జిల్లా కోర్టు, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరుకు తిరుపతి తీవ్రంగా ప్రయత్నించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి రాజయ్య, న్యాయవాదులు హరిశ్చంద్రప్రసాద్, మెతుకు జానారెడ్డి, ఏజీపీ రామ్‌గోపాల్, జిల్లా కోర్టు పీపీ అనగందుల భిక్షపతి, శ్రీరాం శ్రీనివాస్, రామ్‌మోహన్‌రెడ్డి, లక్ష్మణస్వామి, పానుగంటి శ్రీనివాస్, కందుల సత్తయ్య, చంద్రరుషి, వజ్జులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ పర్యటనను అడ్డుకోండి

- ఉస్మానియా జేఏసీ వ్యవస్థాపక సభ్యుడు పృథ్వీరెడ్డి

దేవరుప్పుల : అమరుల త్యాగాల పునాదుల మీద ఏర్పడిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్.. అప్పులపాలు చేసి, ప్రజాస్వామిక పాలన స్థానంలో రాచరిక, నియంతృత్వ కుటుంబ పాలనను కొనసాగిస్తున్నాడు.. ఇందుకు నిరసనగా సీఎం వల్మిడి పర్యటనను అడ్డుకోవాలని ఉస్మానియా జేఏసీ వ్యవస్థాపక సభ్యుడు ఇప్ప పృథ్వీరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దళితులకు మూడెకరాల భూమి, దళిత ముఖ్యమంత్రి, కేజీ టు పీజీ ఉచిత విద్య, కుటుంబానికో ఉద్యోగం, ఇల్లు లేని నిరుపేదలకు డబల్ బెడ్రూం ఇళ్లు, ఓపెన్ కాస్ట్ మైనింగ్ నిషేధం వంటి హామీలను తుంగలో తొక్కి కొడుకు కేటీఆర్‌కు పట్టాభిషేకం చేసేందుకు కుటిల రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. సీమాంధ్రుల పాలనలోనైనా ప్రజాసమస్యలపై పోరాడేందుకు స్వేచ్ఛ ఉండేదని, ఆ వాతావరణానికి విఘాతం కలిగించిన కేసీఆర్‌కి.. తెలంగాణ విముక్తి పోరాట పురిటిగడ్డ పాలకుర్తిపై అడుగు పెట్టే నైతిక హక్కు లేదన్నారు. దొడ్డి కొమురయ్య, బందగీ, చాకలి ఐలమ్మ, ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డి ఉద్యమనేతల్ని కన్న పాలకుర్తి నేల మీద ఉద్యమ చరిత్రను కాలరాసేందుకు ఎర్రబెల్లి దయాకర్‌రావు చేస్తున్న కుటిల రాజకీయాలకు యువత చరమగీతం పాడాలని కోరారు. విద్య, వైద్యం, ఉపాధి, ప్రజాసంక్షేమాన్ని తుంగలో తొక్కి గుళ్లు, గోపురాలకు వేల కోట్ల రూపాయలు కేటాయించడం శోచనీయమని అన్నారు. ప్రకృతి వనరులైన ఇసుక, కొండలు, గుట్టలను మైనింగ్ ఆదాయం పేరిట విధ్వంసం చేస్తూ భావితరాలకు తీరని విఘాతం కలిగించే చర్యలను నిరసించాలని కోరారు.

క్లుప్తంగా

అసిస్టెంట్ ప్రొఫెసర్ల వేతనాలు నిలిపివేత..

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో 2010 సంవత్సరంలో వివిధ విభాగాల్లో నియమితులైన అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఆగస్టు నెలకు సంబంధించిన వేతనాలను యూనివర్సిటీ అధికారులు నిలిపివేశారు. ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి సంబంధించి తుదినిర్ణయం తీసుకునేందుకు ప్రభుత్వం నియమించిన ఐదుగురితో కూడిన కమిటీ జీవో 248ని ఇటీవల హైకోర్టు రద్దుచేసిన విషయం విధితమే. వీరి నియమాకానికి సంబంధించి తుది నిర్ణయం ప్రభుత్వం తీసుకోవాల్సింటుంది. 2019 నవంబర్‌లో వీరి నియమకాన్ని పూర్తిస్తాయి కేయూ పాలకమండలి ఆమోదించలేదు. అప్పటి అధికారులు తుది నిర్ణయం కోసం ప్రభుత్వానికి ఫైల్ పంపారు. ప్రభుత్వం నియమించిన కమిటీ జీవోను హైకోర్టు రద్దు చేశారని వీరి వేతనం నిలిపివేయాలని అప్పట్లో ఉద్యోగం రాని వినిత నాయిని యూనివర్సిటీ అధికారులకు ఇటీవల వినతిపత్రం సమర్పించారు. దీంతో యూనివర్సిటీ అధికారులు ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్లకు వేతనాలు నిలిపివేయడంతో ఆందోళన చెందుతున్నారు. వేతనాలు రాని ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్లు కొందరు శుక్రవారం కేయూ వీసీ తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావును కలిసి వేతనాలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, చీఫ్ విప్ దాస్యం వినయభాస్కర్‌ను కూడా ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్లు కలిసి తమ గోడు విన్నవించుకున్నారు.

'బీఆర్‌ఐ' తరలింపు రద్దు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ కేంద్రంగా ఉన్న బీఆర్‌ఐ (బ్రిడ్జిస్ ఇన్‌స్పెక్టర్) నార్త్ కార్యాలయం, బీఆర్‌ఐ (బ్రిడ్జిస్ ఇన్‌స్పెక్టర్) సౌత్ కార్యాలయం తరలింపును రద్దు చేసినట్లు రైల్వే అధికారులు శుక్రవారం తెలిపారు. కాజీపేటలో ఉన్న రెండు బీఆర్‌ఐ కార్యాలయాల్లో నార్త్ కార్యాలయం విడదీసి మంచిర్యాలలో బీఆర్‌ఐ సబ్ యూనిట్ కార్యాలయం, సౌత్ కార్యాలయం విడదీసి భద్రాచలంలో బీఆర్‌ఐ సబ్ యూనిట్‌లను ఏర్పాటు చేసేందుకు అధికారులు శ్రీకారం చుట్టారు. అయితే ఆయా కార్యాలయాలు తరలింపుతో కాజీపేట జంక్షన్‌ను తీవ్ర నష్టం జ రుగుతుందనే అంశంపై మీడియాలో కథనాలు ప్ర చురింతకావడంతోపాటు రైల్వే జేఏసీ నాయకులు నిరసన చేపట్టారు. దీనిపై స్పందించి ప్రస్తుతం తరలింపును రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.



ఆ రోజు నేను తప్పించుకున్నా..

నా ముందు వరుసలో ఉన్నోళ్లు బలయ్యారు..

- ఉద్యమకారులపై కురిసిన తుపాకుల తూటాలు
- ఆ తర్వాత అరెస్ట్ చేసి చిత్రహింసలు పెట్టారు..
- చనిపోయానని రజకార్లు వెళ్లిపోయారు..
- 1947 సెప్టెంబర్ 2 పరకాల ఘటనను గుర్తు చేసిన చంద్రారెడ్డి
- చాపలబండ రక్తసిక్తమై నేటికి 76 ఏళ్లు



రేగూరి చంద్రారెడ్డి

పరకాల: తెలంగాణ సాయుధ పోరాటంలో 1947 సెప్టెంబర్ 2న పరకాలలో జరిగిన పోరాటం చిరస్మరణీయంగా నిలిచింది. ఎంతో మంది ఉద్యమకారుల వీరమరణంతో పరకాల నేల రక్తసిక్తమై నేటికి 76 ఏళ్లు. మరో జలియన్‌వాలా బాగ్‌గా పిలిచే నాటి పోరాటంలో పాల్గొన్న వ్యక్తి పరకాల మండలం వెల్లంపల్లి గ్రామానికి చెందిన 98 ఏళ్ల పోలీస్‌పటేల్ రేగూరి చంద్రారెడ్డి. పోలీస్‌గా పనిచేసిన ఆయన తెలంగాణ సాయుధ పోరాటానికి ఆకర్శితులై నిజాం సర్కారుపై తిరుగుబావుటా ఎగురవేశారు. పరకాలలో ఆ రోజు ఏం జరిగింది.. అంత మారణహోమం జరగడానికి దారి తీసిన పరిస్థితులపై శుక్రవారం ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

తెలంగాణలో రజకార్ల ఆగడాలకు అడ్డూఅదుపులేకుండా పోయేది. గ్రామాల ప్రజలు రాత్రింబవళ్లు నిద్రహారాలు మానేవారు. ఎప్పుడు ఏ గ్రామంపైనా.. ఎవరిని ఏం చేస్తారో తెలియని భయానక వాతావరణం ఉండేది. నేను నిజాం సర్కార్‌లోనే పోలీస్ పటేల్‌గా పనిచేసేవాడిని. అప్పటిపరిస్థితులను చూసి ఉద్యోగాన్ని వదిలిపెట్టి మారుపేరు రంజిత్‌తో తిరుగుబాటుదారులైన ఎస్.మనోహర్ రావు, కేవీనర్సింగరావుకు సన్నిహితమయ్యా. వారి పోరాట కార్యాచరణలో భాగస్వాముడినయ్యాను. సాయుధ ఉద్యమం తీవ్రంగా కొనసాగుతున్న సమయంలో దామెర మండలంలోని చంద్రగిరి గుట్టలను షెల్టర్‌గా మార్చుకొని నిజాం పాలనకు వ్యతిరేకంగా, రజాకార్ల ఆగడాలపై సాయుధపోరుకు శ్రీకారం చుట్టాం.

మూడు కిలోమీటర్ల పొడవుతో సాగిన ఊరేగింపు

ఆ రోజు 1947 సెప్టెంబర్ 2. అజ్ఞాతంలోకి వెళ్లిన నేతల పిలుపు మేరకు నిజాం నిరంకుశ పాలనను, రజకారులను ఎదిరిస్తూ త్రివర్ణ పతాక ఆవిష్కరణ కార్యక్రమానికి అనేక గ్రామాలనుంచి వేలాది మంది ప్రజలు పరకాలకు తరలివచ్చారు. యూనియన్ పతాకాలు, వడిసేలు, చేతి కర్రలు చేతబూని పతాక వందనానికి కదం తొక్కారు. తొలుత చాపలబండ నుంచి దగ్గు వీరగోపాల్‌రావు నాయకత్వాన ఊరేగింపు నిర్వహించాం. మూడు కిలోమీటర్ల పొడవుతో సాగిన మా ఊరేగింపులో హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో కలవాలని, వందే మాతరం అంటూ నినాదాలు చేశాం.

గర్జించిన నిజాం పోలీసుల తుపాకులు

మా ఊరేగింపు సమాచారం తెలియగానే అప్పటికే ఇక్కడ నిజాం మిలిటరీ పోలీసులు మకాం వేశారు. రజాకారులు కత్తులు, బరిసెలతో సిద్ధమై ఉన్నారు. తహసీల్దార్ విష్ణువేశ్వర్ రావు ఊరేగింపు వద్దకు వచ్చి వెనక్కి తిరిగి రావాల్సిందిగా మా అందరికి(ఉద్యమకారులకు) హెచ్చరికలు జారీ చేశారు. ఉద్రేకం, ఉత్సాహంగా ఊరేగింపు చేస్తున్న మేం తహసీల్దార్ హెచ్చరికలను ఖాతరు చేయలేదు. ఆగ్రహంతో ఊగిపోతూ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జియా ఉల్లా మాపై మరింత బలగాలను మోహరించారు. తహసీల్దార్ అనుమతి మేరకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చేతిలోని పిస్తోల్ ధన్‌మని పేలడంతో నిజాం పోలీసుల తుపాకులు గర్జించాయి. మా కంటే ముందు వరుసలో ఉన్న శ్రీశైలంతోపాటు అనేక మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. చాపలబండ ప్రాంతం రక్తంతో తడిసిముద్దయింది. అక్కడినుంచి నేను తప్పించుకున్న. వారం రోజులకు నన్ను దొరకబట్టి చిత్రహింసలకు గురిచేశారు. చనిపోయాడనుకొని వెళ్లిపోయారు. కానీ కొన ఊపిరితో బయటపడ్డాను. నాటి ఉద్యమ ఫలితంగా తెలంగాణకు విముక్తి లభించడం ఎంతో సంతోషం ఇచ్చింది.

ఆర్టీసీ వరంగల్ రీజియన్ ఘనత..


వరంగల్-1 డిపోలో ఉద్యోగులను అభినందిస్తున్న ఆర్టీసీ ఆర్‌ఎం శ్రీలత

- ఆక్యుపెన్సీ రేషియోలో ద్వితీయ స్థానం
- ఆగస్టు 31న రికార్డు స్థాయిలో రూ.2.57 కోట్ల ఆదాయం

హన్మకొండ: రాఖీ పండుగ టీఎస్ ఆర్టీసీకి అధిక ఆదాయాన్ని సమకూర్చింది. ఆక్యుపెన్సీ రేషియోలో వరంగల్ రీజియన్ రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచింది. నల్లగొండ రీజియన్ మొదటి స్థానంలో ఉండగా 98 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో వరంగల్ రీజియన్ ద్వితీయ స్థానంలో నిలిచింది. రాఖీ పండగ సందర్భంగా ఆర్టీసీ.. వరంగల్ రీజియన్‌లో ప్రత్యేకంగా అదనపు బస్సులు నడిపింది. ఆగస్టు 30న 100 అదనపు బస్సులు, 31న 150 అదనపు బస్సులు నడిపింది. 30న 3.79 లక్షల కిలో మీటర్లు తిరిగి రూ.1.96 కోట్ల ఆదాయం రాబట్టుకోగా, 31న 4.19 లక్షల కిలో మీటర్లు తిరిగి గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.2.57 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకుంది. వరంగల్ రీజియన్‌లో 9 డిపోలుండగా సగటున 98 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో ప్రయాణికులను చేరవేయగా, నర్సంపేట, మహబూబాబాద్, తొర్రూరు, భూపాలపల్లి, పరకాల, జనగామ డిపోలు 100 శాతం ఆక్యుపెన్సీ రేషియో సాధించాయి.

వరంగల్-1 డిపో ఆల్‌టైం రికార్డు..

టీఎస్ ఆర్టీసీ వరంగల్-1 డిపో ఆల్‌టైం రికార్డు సాధించింది. డిపో బస్సులు 68,966కిలో మీటర్లు తిరిగి రూ.45.48 లక్షలు సాధించి డిపోల వారీగా ఆదాయంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచి రికార్డు సాధించింది. ఈ సందర్భంగా శుక్రవారం హనుమకొండలోని వరంగల్-1 డిపోలో అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వరంగల్ రీజినల్ మేనేజర్ జాస్తి శ్రీలత మాట్లాడుతూ డిపో ఉద్యోగులు అంకితభావంతో పని చేయడంతోనే ఈ రికార్డు సాధ్యమైందన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులను అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ కేశరాజు భానుకిరణ్, డిపో మేనేజర్ వి.వెంకటేశం, అసిస్టెంట్ మేనేజర్లు సంతోష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. అలాగే, రాఖీ పౌర్ణమి రోజు అత్యధిక ఆదాయం వచ్చిన సందర్భంగా ఆర్టీసీ హనుమకొండ డిపోలో ఉద్యోగులు సంబు రాలు జరుపుకున్నారు. ఆగస్టు 31న హనుమకొండ డిపో రూ.30,39,164 ఆదాయాన్ని రాబట్టుకుంది. దీంతో ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ శ్రీలత ఉద్యోగులకు స్వీట్లు పంపిణీ చేశారు. డిప్యూటీ ఆర్‌ఎం కేశరాజు భాను కిరణ్, డీఎం బి.ధరం సింగ్, పాల్గొన్నారు.

వందశాతం ఫలితాలు సాధించాలి

- ఐటీడీఏ పీఓ అంకిత్
- ఉమ్మడి వరంగల్ జిల్లా అధికారులతో సమీక్ష


మాట్లాడుతున్న పీఓ అంకిత్

ఏటూరునాగారం: గిరిజన విద్యాసంస్థల్లో టెన్త్ విద్యార్థులు వందశాతం ఉత్తమ ఫలితాలు సాధించాలని, దీనికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను కృషి చేయాలని ఐటీడీఏ పీఓ అంకిత్ కోరారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో ములుగు, మహబూబాబాద్, హనుమకొండ, వరంగల్, జనగామ డిప్యూటీ డైరెక్టర్లతో పీఓ సమీక్ష నిర్వహించారు. 2023-24వ సంవత్సరంలో పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించడానికి విద్యాశాఖ అధికారులు సన్నద్ధం కావాలన్నారు. ముందుగా గత సంవత్సర పదో తరగతి ఫలితాలను పాఠశాలల వారీగా సమీక్షించారు.

యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి..

ఈ సంవత్సరం 100 రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని హెచ్‌ఎంలను ఆదేశించారు. ఇందులో భాగంగా మ్యాథమెటిక్స్ , జనరల్ సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించాలన్నారు. వెనుకబడిన విద్యార్థుల నుంచి సత్ఫలితాలు రాబట్టడానికి 'మ్యాచింగ్.. బ్యాచింగ్' కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. అదేవిధంగా మ్యాథమెటిక్స్‌లో తక్కువ ఫలితాలు నమోదు చేసిన పాఠశాలలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఏసీఎంఓలకు సూచించారు. ప్రతి పాఠశాలలో కనీసం ముగ్గురు విద్యార్థులను జీపీఎస్ 10/10 సాధించేలా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు పోచం, మంకీడి ఎరయ్య, ఏటీడీవోలు దేశిరాం, భాస్కర్, ఏసీఎంఓలు రవీందర్, హీరాలాల్, శ్రీరాములు, రవిశంకర్, జీసీడీఓ సుగుణ, ఆర్‌పీలు వేణుగోపాల్, వెంకటేశ్వర్లు, తేజ, సంపత్ కుమార్, చెంచయ్య, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి ఆహ్వానం

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లా పెంబర్తిలోని మహాత్మాజ్యోతిరావుపూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా కళాశాలలో హిస్టరీ సబ్జెక్టు బోధించేందుకుగాను గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల స్పెషల్ ఆఫీసర్ ఎస్‌వీఎస్‌చారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ చేసిన అర్హులైన అభ్యర్థినులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9866610429 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

మెస్ కార్డులను రెన్యూవల్ చేసుకోవాలి

కేయూ క్యాంపస్: కేయూలో వివిధ పీజీ, ప్రొఫెషనల్‌కోర్సుల విద్యార్థులు 2023-24 సంవత్సరానికి హాస్టల్ మెస్ కార్డుల రెన్యూవల్‌కు దరఖాస్తు చేసుకోవాలని హాస్టళ్ల డైరెక్టర్ వెంకయ్య, అదనపు డైరెక్టర్ సుచిరిత పాల్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 4 నుంచి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. సంబంధిత కళాశాల రశీదు, పాత మెస్ కార్డులు అందించాలన్నారు. స్కాలర్‌షిప్ దరఖాస్తు, మెస్‌బకాయిల చెల్లింపు రశీదులను క్యాంపస్‌లోని హాస్టళ్ల ఆఫీస్‌లో సమర్పించాలని పేర్కొన్నారు.

ఎన్‌సీసీ.. క్రమశిక్షణకు మారుపేరు

- కమాండెంట్ కల్నల్ అజయ్ నంద కందూరి


క్యాడెట్ల లగేజీని పరిశీలిస్తున్న ఎన్‌సీసీ కమాండెంట్

మామునూరు : ఎన్‌సీసీ.. క్రమశిక్షణకు మారుపేరని తెలంగాణ ఎన్‌సీసీ 10వ బెటాలియన్ కమాండెంట్, కల్నల్ అజయ్ నంద కందూరి అన్నారు. శుక్రవారం ఖిలావరంగల్ మండలం మామునూరులోని పోలీస్ శిక్షణ కళాశాల ప్రాంగణంలో ఎన్‌సీసీ 10వ బెటాలియన్ వరంగల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాంపును ప్రారంభించారు. ఈనెల 01 నుంచి 10వ తేదీ వరకు జరుగనున్న క్యాంపునకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 600 మంది క్యాడెట్లు చేరుకున్నారు. ఈ సందర్భంగా కమాండెంట్, కల్నల్ అజయ్ నంద కందూరి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకునేందుకు ఎన్‌సీసీ ఎంతో దోహదపడుతుందన్నారు. ఎన్‌సీసీ ద్వారా దేశానికి కూడా సేవ చేయొచ్చన్నారు. ప్రతి క్యాడెట్ పోటీతత్వంతో శిక్షణలో రాణించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు సదానందం, సుహాస్ కదం, రాధాకృష్ణ, ప్రవీణ్, రాజయ్య, అనిల్, సజని, సౌరస్య, సతీష్, సందీప్, ఇజాజ్, పవర్, శ్రీనివాస్, నారాయణరెడ్డి, పుత్లిబాయ్, కుమారస్వామి, సురేందర్, సతీష్ పాల్గొన్నారు.

దామాషా ప్రకారం అవకాశాలు కల్పించాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్


వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

హన్మకొండ: హక్కుల సాధనే లక్ష్యంగా హైదరాబాద్‌లో ఈ నెల 10న జరిగే బీసీ సింహ గర్జనను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు సామాజిక న్యాయం పాటించాలన్నారు. దామాషా ప్రకారం అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ సామాజిక వర్గాలకు అవకాశాలు కల్పించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కనీసం 60 సీట్లు కేటాయించాలనే డిమాండ్‌తో ఈ నెల 10న హైదరాబాద్ సరూర్‌నగర్ మైదానంలో బీసీ సింహ గర్జన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ కూరపాటి నారాయణ మాట్లాడుతూ ప్రాంతీయ పార్టీలు ప్రైవేట్ కంపెనీల్లా తయారయ్యాయని దుయ్యబట్టారు. బీసీ వర్గాలను దూరం పెట్టిన రాజకీయ పార్టీలకు గుణపాఠం చెప్పాలన్నారు. అనంతరం సింహగర్జన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, బీసీ ఐక్య సంఘర్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజమౌళి, నాయకులు చందా మల్లయ్య, కష్ణమూర్తి, పల్లెపు సమ్మయ్య, చిర్ర రాజు గౌడ్, తంగళ్లపల్లి రమేష్, తాళ్ల సంపత్ కుమార్ మేరు, బచ్చు ఆనందం పాల్గొన్నారు.



నీవు చస్తే.. మరో అమ్మాయిని పెళ్లి చేసుకుంటా..

- పెళ్లయిన ఆరు నెలలకే భర్త వేధింపులు
- మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య
- మృతురాలు రెండు నెలల గర్భిణి


అర్చన (ఫైల్)

రఘునాథపల్లి: వారికి పెళ్లయి ఆరు నెలలైంది. ఆమె రెండు నెలల గర్భిణి. కానీ భర్త.. మరో అమ్మాయితో చనువుగా ఉన్న ఫొటోలను చూసి ఇదేమిటని అడిగితే 'నీవు చస్తే.. ఆ అమ్మాయిని పెళ్లి చేసుకుంటా. ఉరి వేసుకొని చావు' ..అంటూ ఈసడించుకోవడంతో మనస్తాపానికి గురైన వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. ఈ విషాద ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కంచనపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన మద్దూరి కృష్ణ-రేణ దంపతుల కుమార్తె అర్చన అలియాస్ హర్షిణి (20)ని పాలకుర్తి మండలం లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన మల్యాల అంజనేయులు కుమారుడు వినేష్‌కు ఈ ఏడాది మార్చి 10న ఇచ్చి వివాహం జరిపారు. 20 రోజుల క్రితం అర్చనను భర్త, తల్లి కలిసి జనగామలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లి చూపించగా రెండు నెలల గర్భిణిగా వైద్యులు నిర్ధారించారు. అక్కడి నుంచి అర్చనను భర్త వినేష్ తన ద్విచక్రవాహనంపై పుట్టింటికి తీసుకొచ్చి వదిలి వెళ్లాడు. గత నెల 31న వినేష్ భార్య వద్దకు చేరుకున్నాడు. భర్త సెల్‌ఫోన్‌ను అర్చన పరిశీలిస్తుండగా వినేష్ మరో యువతితో సాన్నిహిత్యంగా ఉన్న ఫొటోలను గుర్తించింది. ఆ అమ్మాయి ఎవరు అని నిలదీయగా 'నీవు చస్తే.. ఆ అమ్మాయిని పెళ్లి చేసుకుంటా, ఉరి వేసుకొని చావు' ..అంటూ కోపంతో భర్త వెళ్లిపోయాడు. దీంతో అర్చన తీవ్ర మనోవేదనకు గురైంది. శుక్రవారం ఉదయం భర్త వినేష్... అర్చనకు ఫోన్ చేసి గొడవ పడ్డాడు. ఈ విషయం అర్చన తల్లిదండ్రులకు చెప్పి ఏడ్చింది. తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లాక తీవ్ర మనోవేదనతో ఉన్న అర్చన బాత్‌రూంలోకి వెళ్లి చీరతో ఉరివేసుకుంది. పక్కింటి వారు గుర్తించి ఉరి నుంచి అర్చనను విడదీయగా అప్పటికే అపస్మారక స్థితికి చేరుకుంది. వెంటనే జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్న కొద్ది సేపటికే మరణించింది. అల్లుడు వినేష్ వేధింపులతోనే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు వినేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చాగర్ల రఘుపతి తెలిపారు.

ఏడాది క్రితం కొడుకును కోల్పోయి..

కృష్ణ-రేణ దంపతులకు కుమారుడు మహేష్, కూతురు అర్చన ఉన్నారు. తొమ్మిది నెలల క్రితం కుమారుడు మహేష్ భువనగిరి జిల్లాలో అనుమానాస్పదంగా మరణించాడు. అప్పటికే కూతురు అర్చనకు పెళ్లి ఖాయం కావడంతో వివాహం జరిపించారు. పెళ్లి అయిన ఆరు నెలలకే కుమార్తె మృతి చెందడంతో ఆ తల్లిదండ్రులు విలపిస్తున్న తీరు ప్రతి ఒక్కరి హృదయాలను కలిచివేసింది.

జ్వరాల బారిన టీఎస్‌ఆర్‌డీసీ విద్యార్థినులు

- ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స
- సాధారణమేనని వైద్యుల ధ్రువీకరణ


ఎంజీఎంలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

కరీమాబాద్: వరంగల్ ఉర్సు గుట్ట సమీపంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గురుకుల డిగ్రీ కళాశాలలోని పలువురు విద్యార్థినులకు రెండు రోజులుగా జ్వరం వస్తోంది. దీంతో ప్రిన్సిపాల్ సురేశ్.. జిల్లా వైద్యాధికారులకు సమాచారం అందించి కళాశాలలో వైద్యశిబిరం నిర్వహించడమే కాకుండా సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా శుక్రవారం 26 మందిని ఎంజీఎంకు తరలించి పరీక్షలు చేయించారు. రిపోర్టులన్నీ నార్మల్‌గా రావడంతో ఊపిరి పీల్చుకున్నారు. కాగా, విద్యార్థినులకు సాధారణ జ్వరమే ఉందని, చికిత్స అనంతరం డిశ్చార్జ్ చేస్తామని ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తెలిపారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్ట్

స్టేషన్‌ఘన్‌పూర్: మద్యానికి బానిసై భార్యను కడతేర్చిన భర్తను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ రాఘవేందర్ కథనం ప్రకారం మండలంలోని రంగరాయగూడెం శివారు కాశిగూడెంలో సయ్యద్ హజరత్‌బీని ఆమె భర్త సయ్యద్ అమీర్ గత నెల 29వ తేదీన హత్య చేసిన విషయం విదితమే. మద్యం సేవించడానికి డబ్బులు ఇవ్వమని అమీర్ తరచూ భార్యతో గొడవపడేవాడు. ఆమె కూలీ డబ్బును బలవంతంగా తీసుకుని మద్యం సేవించేవాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఇంటికి వచ్చిన అమీర్.. మద్యం సేవించేందుకు డబ్బులు ఇవ్వమని భార్యతో గొడవపడ్డాడు. ఆమె నిరాకరించడంతో అదేరోజు అర్ధరాత్రి హత్య చేసి పారిపోయాడు. దీనిపై మృతురాలి తండ్రి ఖాసీమ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని శివునిపల్లిలో అమీర్‌ను అరెస్ట్ చేశారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు.

కిడ్నాప్ కేసులో మరో ఆరుగురు..


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

చిట్యాల: మండలంలోని గిద్దె ముత్తారం గ్రామానికి చెందిన మామిడి సమ్మయ్యను భూతగదాల విషయంలో ఇటీవల కొందరు కిడ్నాప్ చేశారు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న చిట్యాల పోలీసులు.. వారం రోజుల నుంచి బృందాలుగా ఏర్పడి కేసును ఛేదించారు. శుక్రవారం గట్టు రాజు, అరెల్లి అఖిల్, మల్లెపు శ్రీకాంత్, అజ్మీరా నవీన్, హట్కర్ రాజు, లాదెళ్ల అనిల్‌ను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 6 సెల్ ఫోన్‌లు, రూ.80వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జె. రమేష్ తెలిపారు. కాగా, ఒకరు పరారీలో ఉన్నారని ఎస్సై పేర్కొన్నారు. త్వరితగతిన కేసు ఛేదించిన చిట్యాల సీఐ వేణు చందర్, ఎస్సై రమేష్, సిబ్బంది సిద్దార్థ, నవీన్, వేణును భూపాలపల్లి డీఎస్పీ రాములు, ఎస్పీ కరుణాకర్ అభినందిచారు.

చోరీ చేసి.. చేతికి చిక్కి..

ఉమ్మడి జిల్లా వ్యాపంగా 8 మంది అరెస్ట్

- పలు దొంగతనాలు చేస్తూ పోలీసులకు పట్టుబడిన దొంగలు
- వివరాలు వెల్లడించిన పోలీసులు


ధర్మసాగర్:వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీధర్‌రావు


హసన్‌పర్తి : శంకర్ అరెస్ట్‌ను చూపుతున్న ఏసీపీ

ధర్మసాగర్: జల్సాలకు అలువాటు పడి చోరీలకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ధర్మసాగర్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ కె శ్రీధర్ రావు వివరాలు వెల్లడించారు. రెండు మూడు రోజుల నుంచి మండలంలోని పలు గ్రామాలలో పార్క్ చేసిన ట్రాక్టర్ బ్యాటరీల చోరీ ఘటనలపై యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం సాయిపేట క్రాస్ రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అంబాల మహేష్, కుమ్మరి ప్రవీణ్, భాస్కకుల అఖిల్, మారపాక అనూప్ కుమార్.. ట్రాక్టర్ బ్యాటరీలను చోరీ చేసి పారిపోతున్నారు. ఇది గమనించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని రూ. 50 వేల విలువైన 6 బ్యాటరీలు, ఒక గ్యాస్ సిలిండర్, ఒక టీ ఫ్లాస్క్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ వివరించారు. సమావేశంలో ఎస్‌ఐలు బి రాజు, పి ఫిలప్ రాజ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కురవిలో మరో వ్యక్తి..

కురవి: ఆలయాల్లో చోరీలకు పాల్పడిన ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై బి.గోపి తెలిపారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన మామిడి గోపి ఈనెల 28వ తేదీన కురవిలోని గంగమ్మ తల్లి ఆలయంలో చోరీకి పాల్పడ్డాడు. అదే విధంగా గత జూన్ 16వ తేదీన మండలంలోని తాట్య తండాలో హనుమాన్ ఆలయం, కురవిలోని రామాలయంలో వరుస చోరీలకు పాల్పడ్డాడు. దీనిపై ఆయా ఆలయాల కమిటీ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అనంతరం దర్యాప్తు చేపట్టి గోపిని శుక్రవారం అరెస్ట్ చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

కొత్తగూడలో మహిళలు..

కొత్తగూడ: ముగ్గురు మహిళలు చోరీ చేస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. ఈ ఘటన శుక్రవారం మండల కేంద్రంలో జరిగింది. మండల కేంద్రంలోని 'నానో' బట్టల షాపులో దుస్తులు కొనుగోలు చేసేందుకు ముగ్గురు మహిళలు వచ్చారు. ఇద్దరు మహిళలు దుస్తులను పరిశీలిస్తున్నట్లు నటించగా.. మరో మహిళ చీరలను కట్టుకుంది. ఈ ఘటనను సీసీ కెమెరాలో గమనించిన షాపు యజమాని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో షాపు వద్దకు చేరుకున్న ఎస్సై నగేష్ మహిళలను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి రిమాండ్ తరలించారు. రద్దీగా ఉండే షాపులను టార్గెట్‌గా చేసుకుని వీరు చోరీలకు పాల్పడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

హసన్‌పర్తిలో ఇంకో వ్యక్తి..

హసన్‌పర్తి : విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి... కాపర్ వైర్లు చోరీ చేస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఏసీపీ డేవిడ్ రాజు కథనం ప్రకారం మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన చిలువేరు శంకర్ జల్సాకు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో హసన్‌పర్తి, ఎల్కతుర్తి, ధర్మసాగర్ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ నిర్మానుష్య ప్రదేశాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైపర్లను చోరీ చేస్తున్నాడు. ఈ క్రమంలో బాహుపేట క్రాస్‌వద్ద తనిఖీలు చేస్తున్న క్రమంలో శంకర్ ఆటోను ఆపకుండా వెళ్లాడు. దీంతో పోలీసులు ఆటోను పట్టుకుని విచారించగా కాపర్ వైర్లు చోరీ చేస్తున్నట్లు ఒప్పుకున్నాడు. అనంతరం శంకర్ వద్ద నుంచి రూ.38 వేలు విలువైన కాపర్ వైర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ డేవిడ్ రాజు చెప్పారు. కాగా, శంకర్ 14 ఏళ్ల నుంచి చోరీలకు పాల్పడుతున్నట్లు డేవిడ్ రాజు తెలిపారు. సమావేశంలో సీఐ గోపి, ఎస్సై రాజు, అశోక్, కానిస్టేబుల్ క్రాంతికుమార్, ఏఏవో సల్మాన్ పాషా నగేష్ తదితరులు పాల్గొన్నారు.